క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామికి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు వేద మంత్రాల నడుమ శుక్రవారం స్వామి వారికి గంధం, పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ఈఓ మోహన్‌బాబు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, కుర్రెంల మోహన్, వీరన్న, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్‌ఈ రఘువీరారెడ్డి, డీఈలు రాజగోపాల్, ఆత్మారావు, ఏఈ సందీప్, సూపరింటెండెంట్ రామకృష్ణ, కార్పొరేటర్ రాధికారెడ్డి పాల్గొన్నారు.

'వేద'లో స్వర్ణప్రాశన



జనగామ: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణప్రాశన వేశారు. చిన్నారుల మేధోశక్తి, కండరాల పటిష్టత, ఇమ్యూనిటీ పవర్, జ్ఞాపకశక్తి తదితర వాటికి పని చేస్తుందని డాక్టర్ తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ: విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దామెర నాగరాజు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమైక్య లిమిటెడ్‌కు గత ప్రభుత్వ తప్పిదాలతో పాల ఉత్పత్తిదారులకు పాల బిల్లులు ఆలస్యమైన విషయాన్ని సమైక్య చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. దీంతో సీఎం స్పందించి అట్టి బిల్లులను విడుదల చేయడంతో జిల్లా పాల ఉత్పత్తిదారుల ఖాతాలో రూ.5.79 కోట్లు జమ కావడం జరిగిందన్నారు.

విహార యాత్రలతో పరిసర ప్రాంతాలపై పరిజ్ఞానం



దేవరుప్పుల: విద్యార్థి దశలో విహార యాత్రలతో పరిసర ప్రాంతాలపై పరిజ్ఞానం పొందుతారని పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజు సూచించారు. మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం వరల్డ్ టూరిజం డే పురస్కరించుకొని ఎన్‌సీసీ కేడెట్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ మాస్టర్ కృష్ణ, ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్ పాల్గొన్నారు.

నియామకం



పెండ్యాల దిలీప్

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన పెండ్యాల దిలీప్ బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా దిలీప్ పదవి వచ్చేందుకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రైలునుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి పడి దాదాపు నలభై సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. జనగామ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైలునుంచి ప్రమాదవశాత్తు వ్యక్తి పడి ఉంటాడని, కుడిచేతిపై కాంతమ్మ సోతియా అనే పచ్చబొట్టు ఉందని, నుదుటిపై మూడు నామాలు ధరించి ఉన్నాడని తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాని జనగామ ఏరియా ఆస్పత్రి మార్చురికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే జనగామ జీఆర్‌పీ పోలీసులకు 94400 27342, 9010100958 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

పాముకాటుతో మహిళ..



మృతురాలు అరుణ

రఘునాథపల్లి: పంట చేనులో పత్తి తీస్తుండగా పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన విషాదకరమైన సంఘటన మండలంలోని శ్రీమన్నారాయణపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన కొంరెల్లి సారెడ్డి- అరుణ (49) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం అరుణ కూలీలతో కలిసి వారి పత్తి చేనులో పత్తి తీస్తున్నారు. ఈ క్రమంలో పత్తి తీస్తుండగా అరుణ కాలుకు పాము కాటు వేయడంతో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త సారెడ్డి, కుమారుడు మహేందర్, కూతురు మౌనిక ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

● స్థల పరిశీలనతోనే సరిపెడుతున్న వైనం

తరిగొప్పుల: తరిగొప్పుల మండలం ఏర్పడి ఏళ్లు గడిచినా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది అరకొర వసతుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకు గదుల్లోనే రికార్డుల భద్రపరచడం, సిబ్బంది విధులు నిర్వర్తించడం తలనొప్పిగా మారింది. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు నిర్వహిస్తుండడంతో ఇటు సిబ్బంది, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాలు సైతం రైతు వేదికలో నిర్వహిస్తున్నారు. భవనాలకు నెలకు వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సొంత భవనాల నిర్మాణం కోసం గతంలో రెండు, మూడు సార్లు స్థల పరిశీలన చేసినా ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కార్యాలయాల సొంత భవనాల కోసం మీనమేషాలు లెక్కించడం శోచనీయమంటున్నారు. ఇప్పటికైనా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

ఒకే చోట కార్యాలయాలు నిర్మించాలి



మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా సమీకృత కార్యాలయం నిర్మించాలి. సొంత భవనాలు లేక పోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా సంబంధిత అధికారులు మండలకేంద్రంలో ప్రభుత్వ స్థలం గుర్తించి ప్రభుత్వ కార్యాయాల భవనాలు నిర్మించేందుకు దృష్టిసారించాలి. ఉన్నతాధికారులు తక్షణమే చొరవ తీసుకుని మండలకేంద్రంలో సొంత భవనాలు నిర్మించాలి.

\- భూక్య చందునాయక్, సీపీఎం నాయకులు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



చిల్పూరు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



కొడకండ్ల: బహుమతులు అందుకున్న క్రీడాకారులు



జఫర్‌గఢ్: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడకండ్ల: విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌వీడీ స్పోర్ట్స్ క్లబ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ నవీన్ సూచించారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీలను ఆయన ప్రారంభించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: చదువు ఒక్కటే విద్యార్థికి పరమావధి కాదని, దానికి తోడు క్రీడల్లో రాణించాలని.. అప్పుడే గుర్తింపు వస్తుందని విద్యాశాఖ మండల అధికారి దాసరి గోవర్ధన్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాకారుల ఎంపికల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎం సంపత్, లింగంపల్లి హెచ్‌ఎం శ్రీదేవి, ఎంపీఓ పాల్గొన్నారు.

కూనూర్‌లో..

జఫర్‌గఢ్: క్రీడల్లో ప్రతిభను కనబర్చి ఉత్తమ క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి ఎండీ పర్వేజ్ కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా కారుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై కంకల సతీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాల, బాలికల ఎంపిక క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం బి. వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

నయవంచకుడు కడియం

● ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

● మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: కేసీఆర్‌ను నమ్మించి మోసం చేసిన నయవంచకుడు కడియం.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ వీడిన శ్రీహరికి సిగ్గు ఉంటే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఆయన శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల, విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. కడియం ప్రెస్టేషన్‌లో ఉన్నాడు.. ఒకసారి ఉప ఎన్నికలు రావు అంటాడు.. ఎన్నికలు వస్తే ఎప్పుడైనా సిద్ధమే అంటాడు.. బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ దక్కదు అంటూ.. పొంతన లేని వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. నాడు ఎన్‌టీఆర్ నుంచి ప్రస్తుతం కేసీఆర్ వరకు అందరినీ మోసం చేసి వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడని అన్నారు. నియోజకవర్గంలో తమ హయాంలో బ్రహ్మాండంగా అభివృద్ధి జరిగితే అసలు అభివృద్ధే లేదనడం సిగ్గుచేటన్నారు. నీతి, నిజాయితీ అని చెప్పుకునే కడియం 1994 సంవత్సరానికి ముందు, ప్రస్తుతం ఆస్తులు ఎన్ని అనే వివరాలు ప్రకటించాలని రాజయ్య డిమాండ్ చేశారు. ఆయా సమావేశాల్లో మాచర్ల గణేష్‌గౌడ్, మారపాక రవి, చాడ సరిత, వై.కుమార్‌గౌడ్, మనోజ్‌రెడ్డి, ముసిపట్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో సమస్యలు పరిష్కారం



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న రాపర్తి సోమయ్య



బచ్చన్నపేట: నినాదాలు చేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండలంలోని సాగరంలో పార్టీ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శిగా బుడిడ కొమురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు వడ్లకొండ సుధాకర్, కుమార్, సమ్మయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రంగరాయగూడెంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: న్యాయమైన సమస్యలపై ప్రజలు ఐక్య పోరాటాలు చేయాలని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. మండలంలోని రంగరాయగూడెంలో సీపీఎం గ్రామస్థాయి సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ నాయకుడు నెలమంచ వెంకట్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శి మంద ఇలిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక సమానత్వం రావాలంటే ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. రడపాక యాదగిరి, మొలుగూరి రాములు, పింగిలి పెద్దిరెడ్డి, కొమురయ్య, రాములు, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

పోచన్నపేటలో..

బచ్చన్నపేట: సమాజంలో పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. మండలంలోని పోచన్నపేటలో పార్టీ గ్రామస్థాయి సభను సీనియర్ నాయకులు మహంకాళి జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్లెం నర్సింహులు, రావుల రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, రాములు, ఇంజ ఎల్లయ్య, కిష్టయ్య, మల్లయ్య, సిద్దులు, వెంకటేషం, వేముల రాణి పాల్గొన్నారు.

హామీలు విస్మరించి మోసం చేసిన కాంగ్రెస్

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి ప్రజలను మోసం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ఆరోపించారు. మండలంలోని శ్రీమన్నారాయణపురంలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన గ్రామశాఖ కార్యదర్శిగా తూడి భాస్కర్, మహిళా కార్యదర్శిగా ఎడ్ల యాదలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పచ్చడాల రాజమణి, రామచంద్రం, దాసు, రజిత, నిర్మల, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత



రఘునాథపల్లి: మరణించిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూత అందించి ఔదార్యం చాటారు. మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన అమనగంటి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి చిన్ననాటి 2001-02 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారు జమ చేసిన రూ. 32 వేల నగదు కుటుంబ సభ్యులకు అందజేసి దాతృత్వం చాటారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పిరమిడ్ ధ్యాన ర్యాలీ

జనగామ: పట్టణ కేంద్రంలో నేడు (శనివారం) పిరమిడ్ ధ్యాన శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించనున్నట్లు పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు వంగాల రాజేందర్, పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షుడు అమృతం వీరస్వామి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మూగ జీవాల పరిరక్షణ కోసం మహా కరుణ మెగా శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 10 గంటలకు ప్రిస్టన్ స్కూల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై చౌరస్తా, నెహ్రూపార్క్, రైల్వేస్టేషన్ గణేష్ వాడ, ఎస్‌ఎంఆర్ గార్డెన్ వరకు నిర్వహించడునని అన్నారు. ఆసక్తి కల వారు ఈ ర్యాలీలో పాల్గొనాలని తెలిపారు.

నేడు ఎన్‌ఆర్‌ఐ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ

జనగామ: పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ, ప్రముఖ కార్డియాలజిస్టు, పూర్వ విద్యార్థి చొల్లేటి రాజనరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా గౌట్ స్కూల్‌లో నేడు(శనివారం) గత ఏడాది టెన్త్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం పంపిణీ చేస్తారని హెచ్‌ఎం కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు.

29న సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

లింగాలఘణపురం: ఈ నెల 29న రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కణ జరుగుతుందని ఆవిష్కరణ ఉత్సవ కమిటీ సభ్యుడు దూసరి గణపతి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా హాజరవుతారని, మండలంలోని గౌడ కులస్తులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సన్మానం

లింగాలఘణపురం: ఎంఎన్‌ఓగా ఉన్న విష్ణుమూర్తిని ఎంఈఓ ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో శుక్రవారం బాధ్యతలు తీసుకోగా ఎమ్మార్సీలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు మల్లికార్జున్, శ్రీలత, యాదగిరి, నర్సింహ్ములు, రవిశంకర్, లక్ష్మణ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, బికోజీ, యాదయ్యతో పాటు ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

మాజీ వైస్ ఎంపీపీకి..

స్టేషన్‌ఘన్‌పూర్: గణపతి నవరాత్రి ఉత్సవాలకు శాశ్వత మండపం నిర్మించిన మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డిని తాటికొండ గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు.

దయాకర్‌కు..

రఘునాథపల్లి: తెలుగు రాష్ట్రాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన చిల్పూర్ మండలం వంగాలపల్లికి చెందిన చిట్యాల దయాకర్‌ను స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఈ నెల 29న హైదరాబాద్‌లో డాక్టరేట్ ప్రదానం చేయనున్న నేపథ్యంలో శుక్రవారం మండలకేంద్రంలోని మండల సమాఖ్యలో ఘనంగా సత్కరించారు.

యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో..

జఫర్‌గఢ్: మండల విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎండీ పర్వేజ్‌ను టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మంగు జయప్రకాశ్, సుధాకర్, శ్రీనివాస్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హర్షం

జఫర్‌గఢ్: అర్యవైశ్య సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఏకగ్రీవంగా

సంక్షిప్తంగా

ఎన్నిక కావడంపై మండల అర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. నాయకులు చిట్టిమళ్ల కృష్ణమూర్తి, గందె సీతారాములు, బొనగిరి శ్రవణ్‌కుమార్, అంచూరి యుగేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ బహూకరణ

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్థానికుడు పకిడె ఎల్లాజీ శుక్రవారం షూ బహూకరించి ఔదార్యం చాటారు. అదే విధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాపోలు రామ్మూర్తి కూతురు అరుణ, అల్లుడు క్రాంతి.. విద్యార్థులకు సాక్సులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మంగు మనోహర్, రాపోలు పృథ్వీ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని చిన్నరామన్‌చర్లలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన తాడూరి యశోదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: ఇటీవల మండలకేంద్రానికి చెందిన తల్లీకూతురు సాంబారి రాధిక, స్పందన ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బైకాని బాల్‌రాజు యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కేజీల బియ్యానికి కావాల్సిన నగదును సాయంగా అందజేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య, మహ్మద్ యాకూబ్, ఏడెల్లి శ్రావణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట: స్థానిక మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో వాచ్ ఉమెన్-చౌకీదార్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఓ బైరగోని రజిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగి 2024 జూన్ 1కి 25 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. మండలానికి చెందిన అభ్యర్థులు ఈనెల 30 సాయంత్రం 4 గంటలలోగా బాలికల వసతి గృహంలో దరఖాస్తులను అందజేయాలని వివరాలకు బైరోజు రజిత ఎస్‌ఓ కేజీవీబీ నర్మెట 99494 12546 ను సంప్రదించాలని తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)గ్రామంలో పలు వారుల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు వడ్లకొండ సుధాకర్ కోరారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో సమస్యలపై సర్వే నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలోని 9,10 వార్డుల్లో వీధిలైట్లు వెలగక పోవడంతో ప్రజలు అంధకారంలో ఉంటున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని కోరారు. వేల్పుల సోమయ్య, ఉప్పునూతల సోమయ్య, రాజు, సోమలక్ష్మి, నరసమ్మ, కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు. రఘునాథపల్లి గ్రామానికి చెందిన గండికోట రాజశేఖర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తుండగా గుర్తించి ట్రాక్టర్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

తరిగొప్పుల: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, ఏదైనా నేరానికి పాల్పడితే కఠిన సెక్షన్లు పెట్టడడం, పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని సీఐ అబ్బయ్య హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

వరద బాధితులకు సాయం



పాలకుర్తి టౌన్: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో విరళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఖమ్మం వరద బాధితులకు కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుడి పేరు పెట్టాలి

పాలకుర్తి టైన్: తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

శంకరమంచి రచనలు స్ఫూర్తిదాయకం

పాలకుర్తి: సాహితీవేత్తలు సమాజాన్ని జాగృతం చేసే రచనలు చేయాలని, శంకరమంచి రచనలు స్ఫూర్తిదాయకమని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య తెలిపారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు శంకరమంచి శ్యామ్‌ప్రసాద్ రచించిన శంకరమంచీయం పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓ పాల్గొని మాట్లాడారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: చిన్నారులకు తల్లిపాలతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తాటికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టి స్క్రీనింగ్ నిర్వహించారు.

పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ

దేవరుప్పుల: ఇంటింటా పౌష్టికాహారం లోపం లేకుండా చూస్తామని మహిళలచే అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేయించారు. నీర్మాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు పురస్కరించుకొని పౌష్టికాహారం వినియోగంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ పట్టణానికి చెందిన కనకాల మల్లేశం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సూర్యాపేట నుంచి జనగామకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొడకండ్ల నుంచి జనగామకు వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టడంతో మల్లేశం కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైనది. జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.

రిజర్వాయర్ నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట రిజర్వాయర్ నీరును శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విడుదల చేశారు. సాయంత్రం రిజర్వాయర్ వద్దకు వచ్చి హడావుడిగా నీటిని విడుదల చేశారు. ఈ రిజర్వాయర్‌తో ఆలేరు నియోజకవర్గంలోని సుద్దాల, గుండాల, ఆలేరు మండలాలకు సాగునీరు అందుతుంది. ఇదిలా ఉండగా ఆర్.ఎస్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి రావాల్సిన నీరు ప్రధాన కాల్వ అంతా కూడుకుపోవడంతో అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నెల్లుట్ల చెరువులోనికి వదిలి అక్కడి నుంచి నవాబుపేట రిజర్వాయర్ నింపకుండా నేరుగా కాలువతో ఆలేరు నియోజకవర్గానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా నవాబుపేట రైతులు ముందుగా రిజర్వాయర్‌ను నింపి నీటిని తరలించాలని, అలా కాకుండా నేరుగా కాల్వతో నీటిని తరలిస్తున్నారని ప్రశ్నించగా వారిని నివారించారు. కాంగ్రెస్ పార్టీ మండల గుండాల మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు, అధికారులు ఉన్నారు.

దేశాన్ని క్లీన్ ఇండియాగా తీర్చిదిద్దాలి

లింగాలఘణపురం: భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై దేశాన్ని క్లీన్ ఇండియాగా తీర్చిదిద్దాలని హెడ్‌డీఎఫ్ మేనేజర్ జగన్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ జగన్ మాట్లాడుతూ ఎవరి ఇంటి పరిసరాలను వారు శుభ్రం చేసుకోవాలని, అదేవిధంగా గ్రామాలను తద్వారా దేశాన్ని క్లీన్ ఇండియాగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, ఫైనాన్సియల్ లిటరసీ కౌన్సిలర్ రవివర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

సాక్షి నెట్‌వర్క్: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో, నైజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీలనాయకులు, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆర్డీఓ వెంకన్న



జనగామ: పోపా ఆధ్వర్యంలో..



జనగామ: మున్సిపల్ కార్యాలయంలో..



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న ఝాన్సీరెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు